


## పాలించే వాడు మనోడైతే..
## పట్టుకునేవాడెవడు?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -120 శుక్రవారం16 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఎల్ నినోతో నీటి సంక్షోభం

## రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న : సీఎం రేవంత్ రెడ్డి

**యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి**

**గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి**

**సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్**



**హైదరాబాద్ అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రం కఠినమైన నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు అంచనా వేసినట్లుగానే పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుందని, ప్రజలు, ముఖ్యంగా రైతాంగం

మిగతాది 2లో...

# మనం చేసి చూపిద్దాం..

## ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం



**ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ**

**క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి**

**భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన**

**క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం**

**మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు**

**న్యూఢిల్లీ అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.
పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు

మిగతాది 2లో...

# మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా

## విజయవాడలో ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

**గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ**

**మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు**

**రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక**

**అమరావతి అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను

మిగతాది 2లో...



# వైసీపీ సిద్ధం

## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు.

**. మేయర్, చైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల**

**మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం**

**వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన**

**జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం**

**7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి**

**అమరావతి అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది. మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

మిగతాది 2లో...





# 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్

**'సర్' వివాదం.. తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన**

**ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం**

**17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం**

**2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం**

**ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన**

**న్యూఢిల్లీ అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో,

మిగతాది 2లో...

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

## : సీజేఐ సూర్యకాంత్

**న్యూఢిల్లీఅక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని తేల్చిచెప్పారు.

మిగతాది 2లో...



# సింగరేణిని ప్రైవేటుకు అప్పగించే ప్రసక్తే లేదు

## బొగ్గు మాయంపై ఆధారాలుంటే బీఆర్ఎస్ బయటపెట్టాలి: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రజలకు గుండె లాంటి సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సింగరేణి ప్రైవేటుపరం కాకుండా గతంలో కాపాడింది, ఇప్పుడు కాపాడుతున్నది, భవిష్యత్తులో కాపాడేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సింగరేణి అంశంలో బీఆర్ఎస్ నేతలు

మిగతాది 2లో...





# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**

**ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ**

**ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్**

**హైదరాబాద్ అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం

మిగతాది 2లో...

# సింగరేణిని ప్రైవేటుకు అప్పగించే ప్రసక్తే లేదు

చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సీఎల్పీ మీడియా హాల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కీలకమైన కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకులు సంస్థకు దక్కలేదని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. దాని వల్ల ఏటా 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చే+స అవకాశాన్ని సింగరేణి కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామన్నారు. సింగరేణికి కొత్త గనులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఖనిజాలు, థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో సింగరేణి విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. సింగరేణిలో బొగ్గు మాయం అంటూ బురద జల్లుతున్న బీఆర్ఎస్ నేతలు.. ఆధారాలుంటే బయటపెట్టాలని సూచించారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను ఎగ్గొట్టి, సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. యాదాద్రి ప్లాంటును సాంకేతిక లోపాలతో మూలన పడేలా చేసిందన్నారు.

# యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్

## విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్కో ఉత్తర్వులు

## విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి

తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.
బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు.

# వైసీపీ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.

విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)
విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)
ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)
మచిలీపట్నం (బీసీ – మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)
ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)
నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)
కడప (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్మన్ అభ్యర్థులు:**

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు చైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ – మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)
పలాస-కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)
నర్సీపట్నం (బీసీ – మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)
యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బొద్దపు తులసి (కాపు)
తుని (బీసీ – మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)
కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మన్నె పద్మ (కమ్మ)
రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)
కొండపల్లి (ఎస్సీ – మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)
తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)
చీరాల (ఎస్సీ – మహిళ): డాక్టర్ ఇస్తార్ల షెర్లీ (మాల)
బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)
ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొరెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)
పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)
మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ – మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)
వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)
గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)
కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)
బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)
కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

# మనం చేసి చూపిద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.
ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

# ఎల్ నినోతో నీటి సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్ నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి కేవలం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న ఈ స్వల్ప జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. వచ్చే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతాంగం పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యాసంగి సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి, తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రైతులు ఈ త్యాగానికి సిద్ధపడాలని, ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని విన్నవించారు. మరోవైపు, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సగటు డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల భారం పడుతోందని, అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ వాడకం జరగడం గతంలో ఎన్నడూ లేదని వివరించారు. మార్కెట్‌లో ఎంత వ్యయానికైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

(మొదటి పేజీ తరువాయి)

కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

(మొదటి పేజీ తరువాయి) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ూ×=) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు సరికాదు..**

విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శన ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న వాదనపై స్పందిస్తూ.. అవన్నీ బలహీనమైన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. బయట రాజకీయ నాయకులు చేసే ప్రకటనలను తాము గమనిస్తూనే ఉన్నామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలియకుండా తాము లేమని వ్యాఖ్యానించారు.

**రాహుల్ గాంధీ, అఖిలేశ్‌కు నోటీసులు..**

సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఇతర నేతలకు నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 12న ఇండియా కూటమి చేపట్టిన నిరసన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో రికార్డైన సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. కాగా, సోమవారం నాడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు.

**ఎన్నికల సంఘం నిర్ణయాలపై ఇండియా కూటమి పిటిషన్..**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, సీపీఎం నేత ఎం.ఏ.బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

# మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.
రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్




అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్

(మొదటి పేజీ తరువాయి)

17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది.
పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

అమ్మకం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శుక్రవారం16 అక్టోబర్ 2026

# తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు**

**సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు**




**హనుమకొండ/ బ్యూరో అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త)** తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ కాలనీ లో గురువారం అత్యంత వైభవంగా ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు బతుకమ్మ ఆట-పాట-మాట నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన అస్తిత్వానికి ప్రతీక అయినటువంటి మన సంస్కృతికి వారధి అయినటువంటి బతుకమ్మ పండుగను తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో అతిపెద్ద పండుగ అని కొనియాడారు. ప్రకృతి పరవశించే విధంగా భిన్న రకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి ఆడే బతుకమ్మ ఎంతో విశిష్టతమైనదని అన్నారు. బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదని, మన ఆడపడుచుల ఆత్మీయతకు, తెలంగాణ ఆచారాలకు అందమైన వేడుక అని అన్నారు. అదే విధంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళ పెళ్ళికి తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, వితంతువుల పెన్షన్లు రెట్టింపు, స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 50 శాతం మహిళలకు కేటాయింపు వాగ్దానాలను, గ్యారంటీలను బతుకమ్మ పండుగ సందర్భంగా వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు మాలోత్ శంకర్ నాయక్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసమళ్ళ దీన, సిపిఐ నాయకులు పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, మాలోత్ మంగ, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు తాటికంటి మమత, రొంటాల శ్యామ్, తిప్పనపల్లి మోహన్, జెట్టి కృష్ణ, పెనుకుల మధు, కళ్యాణి, హేమలత, లావణ్య, శిరీష, పద్మ, సునీత, కవిత తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఆర్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రముఖ స్టార్ హోటళ్లలో 20 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు**



**ఎల్కతుర్తి/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. హుజూరాబాద్‌లోని ఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో విద్యనభ్యసించిన సుమారు 20 మంది విద్యార్థులు ప్రముఖ స్టార్ హోటళ్లు, వివిధ ఆతిథ్య రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు సాధించారు. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన విద్యార్థులు ఉద్యోగాలు పొందడం తమకు గర్వకారణమని కళాశాల చైర్మన్ అనూష రెడ్డి అన్నారు.

**నైపుణ్యాలకు పెద్దపీట:**విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కళాశాల పనిచేస్తోందని అనూష రెడ్డి తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో రాణించేందుకు అవసరమైన ప్రాయోగిక శిక్షణ, సంభాషణ నైపుణ్యాలు, వృత్తిపరమైన మెళకువలను విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తూ విద్యార్థులు మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల కృషి, నైపుణ్యాలు, కళాశాలలో అందించిన శిక్షణ వారి విజయానికి దోహదపడ్డాయని పేర్కొంది.

# సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు వచ్చే వరకు పోరాటం ఆగదు!

**హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా అమలేది?**

**ముఖ్యమంత్రి ఇంటి ముందు వంటావార్పు చేపడతాం: రాష్ట్ర ఉద్యమకారుల సంఘం**






**హనుమకొండ/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నక్క సుమన్ స్పష్టం చేశారు. సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కళాకారుల నిరసన, నిరాహార దీక్ష కార్యక్రమం బుధవారం హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద నిర్వహించారు.

**ఉద్యమంలో గొంతెత్తాం. నేడు ఉపాధి కోసం పోరాడుతున్నాం**

తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు ప్రస్తావించారని, అమరవీరుల తర్వాత కళాకారులదే స్థానం అని వేదికలపై చెప్పినప్పటికీ, ఆచరణలో మాత్రం కొద్దిమందికే సాంస్కృతిక సారధి పేరుతో ఉద్యోగాలు కల్పించారని నక్క సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో కళాకారులు ఉండగా, కొంతమందికే ఉద్యోగాలు ఇవ్వడంతో మిగిలిన వారు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, అధికారులకు, అసెంబ్లీ పరిసరాల్లోని గన్‌పార్కు వద్ద పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని విమర్శించారు.

**వెయ్యి ఉద్యోగాల హామీ ఏమైంది?**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా గ్రామాల్లో పర్యటించి ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారధిలో వెయ్యి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారని కళాకారులు గుర్తుచేశారు. ఆ హామీపై నమ్మకంతో గ్రామస్థాయిలో తమ పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశామని తెలిపారు.

అయితే హామీ ఇచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.




**స్పందించకుంటే సీఎం ఇంటి ముందు వంటావార్పు**

కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే భవిష్యత్తులో ముఖ్యమంత్రి ఇంటి ముందు వంటావార్పు కార్యక్రమం చేపడతామని రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు అనుభవం వెంకటేశం హెచ్చరించారు. ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యపరిచిన కళాకారులు నేడు తమ జీవనోపాధి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన, నిరాహార దీక్ష కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నక్క సుమన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పాల్నాటి రాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌తో పాటు దార దేవేందర్, మహంకాళి యాకూబ్, ఆరూరి పూలమ్మ, కొట్టి రమేష్, జోగు రాజు, కొలిపాక రజనీకాంత్, వాస్కుల శోభ, మునిగాల శ్రావణి, పిట్టల భవాని, సిద్ధుమల్ల ప్రణీత, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

**అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి**



**తల్లాడ/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటే అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తల్లాడ తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచించారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రులకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్నవారితో పాటు ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా ఓటరు నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ బ్లాక్ అధ్యక్షుడిగా మొగ్గం కృష్ణంరాజు

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా**



**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ సేవాదళ్ జనగామ జిల్లా నూతన కమిటీలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ బ్లాక్ అధ్యక్షుడిగా తాటికొండ గ్రామానికి చెందిన మొగ్గం కృష్ణంరాజు నియమితులయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మొగ్గం కృష్ణంరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బ్లాక్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు. సేవాదళ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సింగపురం ఇందిర, జాయ మల్లేష్ తదితరులకు కృష్ణంరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతనంగా నియమితులైన నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ సూచించారు. సేవాదళ్‌ను గ్రామస్థాయి వరకు బలోపేతం చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో కనకదుర్గమ్మ దర్శనం

**తాటికొండ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ**

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం దుర్గామాత అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజ, అర్చన కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో



ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు, భవానీ మాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి తదితరులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



# నారాయణపేటలో దారుణం

**: పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య**

**/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**



వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది.

మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు.ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

అనుక్షణం ప్రజల పక్షం
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
RNI NO: TELTEL/2023/87607



## పెట్టుబడి తగ్గాలి.. ప్రకృతి వ్యవసాయం పెరగాలి!

### ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల




**వర్ధన్నపేట/అక్టోబర్ 14 (జర్నలిస్ట్ వార్త):** సాగు ఖర్చులు తగ్గించుకొని, నేల సారాన్ని కాపాడుకోవాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని ఏటీఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరులతో పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. నల్లబెల్లి క్లస్టర్ పరిధిలోని రామ్‌ధాన్ తండాలో బుధవారం నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించడం ద్వారా సాగు పెట్టుబడులను తగ్గించుకోవచ్చని, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని వివరించారు. కార్యక్రమంలో నీమాస్త్రం తయారీని ప్రత్యక్షంగా ప్రదర్శించి, పంటలను ఆశించే కొన్ని రకాల పురుగుల నివారణలో దాని వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల పొలాలను సందర్శించి సాగు పద్ధతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామ్‌ధాన్ తండా సర్పంచ్ వెంకన్న, వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, ఇతర వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





## నూతనకల్లులో శ్రీ శివగిరి మణికంఠ ప్రతిష్ఠ మహోత్సవం

### 16న పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ.. భక్తులకు నిర్వాహకుల సకల సౌకర్యాలు

**తల్లాడ/అక్టోబర్ 14 (జర్నలిస్ట్ వార్త):** పచ్చని పొలాల మధ్య ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న తల్లాడ మండలం నూతనకల్లు గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ శివగిరి మణికంఠ పుణ్యక్షేత్రంలో ఈ నెల 15, 16 తేదీల్లో ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

**వేద మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ**

దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త, అధ్యక్షుడు సత్తెనపల్లి యాదగిరి నాగబ్రహ్మాచార్యులు (గిరి) ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 16న ఉదయం 8.43 గంటలకు గణపతి స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, స్ఫటిక లింగ లింగేశ్వరుడు, లలితా దేవి, మాళికాపురత్తమ్మ, ద్వారపాలకులు, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠలతో పాటు ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. వేద పండితులు, ప్రతిష్ఠాచార్యులు రామడుగు నరసింహాచార్యులు, రామడుగు విక్రమాచార్యులు, సోము నరేష్ ఆచార్యులు, మోతుకూరి ఫణీంద్రాచార్యులు, వారి మిత్రబృందం వేద మంత్రోచ్ఛారణల నడుమ క్రతువులను నిర్వహించనున్నారు.



**15న అభిషేకాలు.నగర సంకీర్తన**

ఈ నెల 15న ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం అయ్యప్ప స్వాములు, భక్తుల ఆధ్వర్యంలో గ్రామంలో నగర సంకీర్తనతో పాటు ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 16న ప్రధాన ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనుంది.

**వేలాదిగా తరలిరానున్న భక్తులు**

ఈ మహోత్సవాలకు అయ్యప్ప మాలధారులు, భవానీ మాలధారులు, శివమాలధారులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు భావిస్తున్నారు. స్వామివారి దివ్యదర్శనం చేసుకుని అన్నప్రసాదం స్వీకరించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

శ్రీ శివగిరి మణికంఠ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెంది, భక్తుల కొంగుబంగారంగా వర్ధిల్లాలని ఆలయ చైర్మన్ గుర్రాల రమణారెడ్డి ఆకాంక్షించారు. ప్రతిష్ఠ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీజేపీదే!

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బద్దం మహిపాల్‌రెడ్డి విమర్శలు

**పెనుబల్లి/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంటుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పెనుబల్లి మండలం వి.ఎం.బంజర్‌లోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు అధ్యక్షతన గురువారం సత్తుపల్లి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



గతంలో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే పదవి కోసం ఎమ్మెల్సీ స్థానాన్ని వదులుకున్నారని మహిపాల్‌రెడ్డి విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్నారని ప్రస్తావించారు. ఈ పరిణామాలను బట్టి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఆ రెండు పార్టీలు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. విద్యావంతులైన పట్టభద్రులు ఈసారి బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, ప్రజలు ఆ పార్టీని ఇప్పటికే తిరస్కరించారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జాబ్ క్యాలెండర్ హామీ అమలుకు సంబంధించి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు రావాల్సిన కరవు భత్యం (డీఏ), వేతన సవరణ (పీఆర్సీ) ప్రయోజనాలు, పదవీ విరమణ అనంతరం అందాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పట్టభద్రులు తమ ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదును పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చేపడుతున్నారని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మండల, పోలింగ్ బూత్ స్థాయుల వరకు దశలవారీగా ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు నమోదు ప్రాధాన్యాన్ని వివరిస్తూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి పాల నాగ సురేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఓటరు నమోదు నియోజకవర్గ కన్వీనర్ పర్సా రాంబాబు, పెనుబల్లి మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు, కల్లూరు మండల అధ్యక్షుడు పసుపులేటి సుబ్బారావు, తల్లాడ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివ, సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్, వేంసూరు మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరణాలపై మౌనమెందుకు?

### మెడికవర్ ఘటనలపై సమగ్ర విచారణ ఏది? వాస్తవాలు వెల్లడించాలి..

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి ప్రభుత్వం స్పందించే వరకు ధర్నా కొనసాగిస్తాం

### దళిత, బహుజన మహిళా నాయకులు






**సికింద్రాబాద్/అక్టోబర్ 14 (జర్నలిస్ట్ వార్త):** ఆసుపత్రిలో వరుస మరణాలపై ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయడం లేదని దళిత, బహుజన మహిళా నాయకులు ప్రశ్నించారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో సెప్టెంబర్ 21, 22 తేదీల నుంచి ఇప్పటివరకు సుమారు 20 మంది మరణించినట్లు పేర్కొంటూ ఈ ఘటనలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మరణాల వెనుక కారణాలేమిటి? వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఏమైనా జరిగిందా? నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని కోరారు.

జర్నలిస్ట్ కల్పన, తెలంగాణ పద్మ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు హేమసుదర్శన్ జిల్లోజుల, జంజి రమ్యగౌడ్, టీఆర్ఎస్ నాయకురాలు బంజాపల్లి సుధారాణి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం తేలికగా తీసుకోకూడదన్నారు. మరణాలపై వస్తున్న ఆరోపణలను కేవలం ప్రకటనలతో సరిపెట్టకుండా, ప్రతి ఘటనకు సంబంధించిన వైద్య రికార్డులు, చికిత్స వివరాలు, మరణ కారణాలను నిపుణుల కమిటీతో పరిశీలించాలని డిమాండ్ చేశారు.

**విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి!:** వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించాలని నాయకులు కోరారు. విచారణలో వైద్య నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన ఆధారాలు లభించిన పక్షంలో ఆసుపత్రి లైసెన్సు, వైద్య సేవల నిర్వహణపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

**స్పందించే వరకు ఆందోళన ఆగదు!** :ప్రభుత్వం అధికారికంగా స్పందించి, విచారణకు సంబంధించి స్పష్టమైన చర్యలు చేపట్టే వరకు ధర్నా కొనసాగిస్తామని మహిళా నాయకులు ప్రకటించారు. ఎన్ని అరెస్టులు చేసినా వెనక్కి తగ్గబోమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం, ఆసుపత్రుల పనితీరులో పారదర్శకత, వైద్య సేవల్లో జవాబుదారీతనం ఉండటం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. మరణాలపై అధికారిక వివరాలు వెల్లడించి, బాధిత కుటుంబాల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

## భారత రాజ్యాంగంపై దాడి అప్రజాస్వామికం

### రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలి

### పరిరక్షణ చైతన్య వేదిక జేపీసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి -మండల అధ్యక్షుడిగా గడ్డం సంజీవ్ కుమార్ ఎన్నిక

**ధర్మసాగర్/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పరిరక్షణ చైతన్య వేదిక జేపీసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన మండల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా బలహీనపరిచేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే, మతతత్వ భావజాలాన్ని ప్రోత్సహించే విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, లౌకికవాద విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు.

**మండల అధ్యక్షుడిగా గడ్డం సంజీవ్ కుమార్ ఎన్నిక**

పరిరక్షణ చైతన్య వేదికలో భాగంగా నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా అడ్వకేట్ గడ్డం సంజీవ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశంలోని భిన్న మతాలు, కులాలు, జాతుల ప్రజలకు సమాన హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగంలోని లౌకికవాద స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతతత్వ విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ పీఠికలోని విలువలను కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రజలు, మేధావులు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



**నూతన కమిటీ ఎన్నిక**

కమిటీ ప్రధాన కార్యదర్శిగా పర్లపల్లి పృథ్వీరాజ్, మండల సమన్వయకర్తగా ఎస్. రాజమౌళి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అంబాల స్వామి, జూపాక శీను, నిమ్మల మనోహర్, ఆరెపల్లి రాజయ్య, పాటి భగవాన్ గౌడ్, కార్యదర్శిగా బొంకురి కార్తీక్ ఎంపికయ్యారు. సభ్యులుగా పెండ్యాల సుదర్శన్, మేకల రవీందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ద్యాగల సారయ్య, మేకల వీరన్న యాదవ్, చెప్పాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఎస్ఐగా భోగం ప్రవీణ్

**వర్ధన్నపేట/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ప్రవీణ్ భోగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వర్ధన్నపేటకు వచ్చారు. నూతన ఎస్ఐ బాధ్యతలు చేపట్టడంతో వర్ధన్నపేట పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనున్నారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.



## అతివేగం.. అజాగ్రత్త.. బైక్ ఢీకొని సెలూన్ నిర్వాహకుడికి తీవ్ర గాయాలు

### పల్సర్ బైక్ రైడర్‌పై కేసు నమోదు

**హసన్‌పర్తి/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** అతివేగం, అజాగ్రత్తతో బైక్ నడిపి సెలూన్ నిర్వాహకుడిని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.

నాగారం గ్రామానికి చెందిన మాచర్ల భిక్షపతి (40) ఎర్రగట్టుగుట్ట సమీపంలో సంజయ్ సెలూన్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం (అక్టోబర్ 14) రాత్రి 10.30 గంటల సమయంలో పని ముగించుకుని తన హోండా షైన్ బైక్ (AP`36`AS`2037)పై ఇంటికి బయలుదేరాడు. గ్రీన్‌వుడ్ స్కూల్ సమీపానికి చేరుకోగానే పరకాల మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కోడెపాక రాజేంద్రప్రసాద్ తన పల్సర్ బైక్ (ఎపీ-36-ఎసీ-7849)తో భిక్షపతి బైక్‌ను ఓవర్‌టేక్ చేసి అకస్మాత్తుగా బ్రేక్ వేసినట్లు పోలీసుల కథనం. దీంతో రెండు బైక్‌లు ఢీకొనగా భిక్షపతి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన ఎల్కటి రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని బంధన్ ఆసుపత్రికి తరలించారు. భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన వద్దే ఉండి పరిచర్యలు చేయాల్సి వచ్చిందని, అందువల్ల ఫిర్యాదు ఆలస్యమైందని భిక్షపతి భార్య మాచర్ల మమత (30) తెలిపారు. గురువారం ఆమె హసన్‌పర్తి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ వెల్లడించారు.



TELTEL/2023/87607

# పాలించే వాడు మనోడైతే..
# పట్టుకునేవాడెవడు?

**వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక దందాపై ఆరోపణలు!**

**ల్యాయబర్తి నుంచి నందనం, రామ్‌నగర్ వరకు అక్రమ రవాణా సాగుతోందన్న ప్రచారం**

**అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరి పేరిట? అధికారుల మౌనానికి కారణమేంటి?**

**జార్నలిస్ట్ వార్త । ప్రత్యేక కథనం**
**(వర్ధన్నపేట నియోజకవర్గం); అక్టోబర్ 14(జర్నలిస్ట్ వార్త):**
ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిది. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక తరలింపుపై వస్తున్న ఆరోపణలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వర్ధన్నపేట మండలం ల్యాయబర్తి, తదితర ప్రాంతాలతోపాటు ఐనవోలు మండలం నందనం, రామ్‌నగర్, ఒంటి మామిడి, పెళ్లి వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, తరలింపు వ్యవహారాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న కార్యకలాపాలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే ఇసుక తరలిస్తున్నారా? అన్నది అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

**పాలించే వాడు మనోడైతే.. పట్టుకునేవాడెవడు?**
అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వ్యవస్థలే ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు నాయకులు, అధికారుల అండదండలతోనే ఇసుక తరలింపు సాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ అవసరం. అయినా ప్రజల్లో ఇలాంటి అనుమానాలు తలెత్తడం వెనుక కారణాలేమిటో యంత్రాంగం ఆలోచించాల్సిన అవసరం ఉంది.
అన్న ధోరణి నిజంగానే ఉంటే అది చట్టబద్ధ పాలనకే సవాలు. రాజకీయ పరిచయాలు ఉన్నా, అధికారుల అండ ఉందన్న ప్రచారం ఉన్నా. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. చట్టం ఎవరి సొంతం కాదు. అది అందరికీ సమానంగా అమలవ్వాలి.

**అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరి పేరిట?**
ఇసుక తవ్వకాలు, రవాణాకు సంబంధించి కీలకమైన ప్రశ్న ఇదే. ల్యాయబర్తి, నందనం, రామ్‌నగర్, ఒంటి మామిడి, పెళ్లి వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ సంస్థకు లేదా వ్యక్తికి ఇచ్చారు? ఎంత పరిమాణంలో తవ్వకాలు, తరలింపునకు అనుమతించారు? అనుమతించిన పరిధి ఎంత? ఏ మార్గంలో, ఏ సమయాల్లో రవాణా చేయాలి? అనే వివరాలను అధికారులు వెల్లడించాలి. అనుమతులు ఉన్నంత మాత్రాన ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపే హక్కు ఎవరికీ ఉండదు. అనుమతుల పరిధి దాటి తవ్వకాలు జరిపినా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమతులు లేని పక్షంలో అక్రమ రవాణాను అడ్డుకుని, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి.

**వాగుల ఉనికికే ముప్పు?**
వాగులు, వాటి పరివాహక ప్రాంతాలు ప్రకృతి




సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిగితే భూగర్భ జలాలపై ప్రభావం, వాగుల సహజ ప్రవాహానికి అంతరాయం, పరిసర ప్రాంతాల పర్యావరణానికి నష్టం కలిగే ప్రమాదం ఉంది. అందుకే ఇసుక తవ్వకాలపై పర్యవేక్షణ కేవలం ఆదాయానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ప్రకృతి సంపద పరిరక్షణకు సంబంధించిన బాధ్యత కూడా.

**అధికారుల మౌనం వెనుక ఏముంది?**
పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖలతోపాటు సంబంధిత పర్యావరణ, నీటిపారుదల శాఖలు తమ పరిధిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలి. అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందాయా? తనిఖీలు నిర్వహించారా? వాహనాలను తనిఖీ చేశారా? ఉల్లంఘనలు గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనుమతుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలి.
అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు వాస్తవం కాకపోతే అధికారిక వివరాలతో ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. ఏది జరిగినా మౌనం మాత్రం అనుమానాలకు తావిస్తుంది.

**చట్టం ముందు అందరూ సమానమే!**
వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లో వాగు పరివాహక ప్రాంతాలపై సమగ్ర తనిఖీలు చేపట్టి, అనుమతులుతవ్వకాల పరిమాణంరవాణా వివరాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. రాజకీయ పలుకుబడి ఉందన్న ప్రచారంతోనో, అధికారుల అండ ఉందన్న ఆరోపణలతోనో ఎవరూ చట్టానికి అతీతులు కాలేరు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. దాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే మౌనంగా ఉంటున్నాయన్న అనుమానాలకు తావివ్వకుండా నిజానిజాలను వెలికితీయాల్సిన సమయం ఆసన్నమైంది. వాగుల్లో ఇసుక తరలింపుపై ప్రజలకు సమాధానాలు కావాలి. అధికారుల నుంచి స్పష్టత రావాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు కనిపించాలి!

**అనుమతులపై స్పష్టత ఇచ్చేదెవరు?**
ఒకటే నియోజకవర్గం రెండు జిల్లాలు, జిల్లాకు ఒక వేరువేరు అధికారి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా ఐనవోలు మండలాల్లో వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, రవాణాపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆయా ప్రాంతాల్లో ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరి పేరిట ఇచ్చారు? నిబంధనలకు అనుగుణంగానే తవ్వకాలు జరుగుతున్నాయా? అనే వివరాలను అధికారులు వెల్లడించాలి. ఆరోపణల్లో వాస్తవమెంత, అవాస్తవమెంత అన్నది అధికారిక పరిశీలనతోనే తేలాలి. ప్రకృతి సంపద పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది.



**గ్రామస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కొత్త అధ్యక్షులు**

**వర్ధన్నపేట/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గురువారం ప్రకటించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు.



VILLEGE CONGRESS PARTY PRESIDENTS LIST WARDHANNAPETA MANDAL

| S.NO | VILLEGE | NAME | S/O & HUSBEND NAME | CAST | MOBILE |
|---|---|---|---|---|---|
| 1 | DHAMANNAPETA | BHAKKATHATLA LINGARAJU YADAV | RAMULU | BC YADAV | 9618314600 |
| 2 | ELLANDA | EDDU RAJENDRA PRASAD | SAILU | BC YADAV | 9949015560 |
| 3 | NALLABELLI | THATIKAYALA DILEEP | ANANDHAM | SC MADIGA | 9502664366 |
| 4 | RAMAVARAM | GAJJELA RAMACHADRU | SAILU | BC MUNURKAPU | 9704372562 |
| 5 | VENKATRAOPALLY | GOTTAM CHIRANJEEVI | MALLAIAH | BC MUNURKAPU | 9676660279 |
| 6 | LYABARTHY | KOYYETI VENKANNA | VEERASWAMI | BC GOUD | 9912187506 |
| 7 | RAMDAN THANDA | GOGULOTH DEVENDER | JUMMILAL | ST LAMBADA | 9959322672 |
| 8 | KADARIGUDEM | CHOLLETI RAMANAREDDY | KOMURA REDDY | OC REDDY | 6309240288 |
| 9 | KUMMARIGUDEM | UPPUNOTHULA RAMULU | KOMURAIAH | BC KUMMARI | 9963278526 |
| 10 | BANDARUPURAM | SENAPALLY BABU | KOMURAIAH | SC MADHIGA | 9908244286 |
| 11 | DIVITIPALLY | KARKA NARSIMHA REDDY | RAGHAVAREDDY | OC REDDY | 9989489832 |
| 12 | CHANDRUTHANDA | BHUKYA SRIRAMULU | VENKAT RAMULU | ST LAMBADA | 8978547427 |
| 13 | AMBETHKAR NAGAR | SINGAPURAM ELIYAS | VENKATAIAH | SC MADHIGA | 9701320355 |
| 14 | KASHAGUDEM | SHEK AFZAL | HUSSEN | MUSLIM | 9963531660 |
| 15 | KATRIYALA | THIGALA SUNITHA | PRABHAKAR | BC GOUD | 7095729502 |
| 16 | CHENNARAM | BARLA SATHISH | VENKANNA | SC MADIGA | 9908703738 |
| 17 | UPPARPALLY | CHELAKAPALLY ANIL | SAMMAIAH | BC MUDHIRAJ | 9010074658 |
| 18 | KOTHAPALLY | THALAPALLY YADAGIRI | KONDAIAH | BC GOUD | 9949084229 |

# ఈఎంఐల ఉచ్చు..

## చిట్టీల చుట్టూ చితికిపోతున్న బతుకులు!

**సంపాదనంతా అప్పులకే.. పండుగలూ వాయిదాల పైనే!**

**హోదా కోసం ఆరాటం.. కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం!**




నెల మొదట్లో జీతం చేతికొస్తుంది. అప్పటికే ఈఎంఐల కోసం బ్యాంకులు ఎదురుచూస్తుంటాయి. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, సరుకుల ఖర్చులు, చిట్టీల చెల్లింపులు వరుస కడతాయి. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్ము కళ్లముందే కరిగిపోతుంది. నెలాఖరుకు చేతిలో మిగిలేది శూన్యం.. అవసరాలకు మళ్లీ అప్పే దిక్కు! ఇదీ నేటి అనేక మధ్యతరగతి, పేద కుటుంబాల వాస్తవ పరిస్థితి. సంపాదన పెరగకపోయినా ఖర్చులు పెరుగుతున్నాయి. ఆదాయం రాకముందే దాన్ని ఎలా ఖర్చు చేయాలో నిర్ణయించే స్థాయికి ఈఎంఐలు, చిట్టీలు చేరాయి.

**హోదా కోసం అప్పులు.. బతుకు కోసం తిప్పలు!**
మొబైల్ నుంచి బైక్ వరకు. టీవీ నుంచి ఇంటి సామగ్రి వరకు ప్రతిదీ వాయిదాల మీదే కొనుగోలు చేసే పరిస్థితి పెరిగింది. కొనుగోలు చేసే సమయంలో నెలకు చెల్లించే చిన్న మొత్తం కనిపిస్తుంది కానీ, దాని వెనుక ఉన్న దీర్ఘకాలిక భారం కనిపించదు. ఆదాయానికి మించి ఈఎంఐలు తీసుకోవడం, ఒక చిట్టీతో మరో చిట్టీని నెట్టుకురావడం చివరకు అప్పుల వలలోకి నెడుతోంది. ఇతరుల ముందు తమ స్థాయి తగ్గకూడదనే ఆరాటం.. కుటుంబ ఆర్థిక స్థితిని మాత్రం దిగజారుస్తోంది. అవసరానికి మించిన ఆడంబరం కొంతకాలం హోదాను చూపించవచ్చు. కానీ ఆ తర్వాత నెలల తరబడి ఆర్థిక ఒత్తిడిని మిగులుస్తుంది.

**పండుగల వేళా.. అప్పుల లెక్కలే!**
పండుగ వచ్చిందంటే ఇంట్లో ఆనందం వెల్లివిరియాలి. కానీ అనేక కుటుంబాల్లో పండుగ ఖర్చుల కంటే అప్పుల లెక్కలే ఎక్కువగా ఉంటున్నాయి. కొత్త బట్టలు కొనాలన్నా, పిల్లలకు కావాల్సినవి సమకూర్చాలన్నా, బంధువుల ముందు పరువు నిలబెట్టుకోవాలన్నా అప్పు చేయాల్సిన దుస్థితి. బయటకు నవ్వుతూ కనిపించే కుటుంబాల వెనుక ఆర్థిక ఆందోళనలు దాగి ఉంటున్నాయి. పండుగను ఆనందంగా జరుపుకోవాలనే కోరిక తప్పు కాదు. అందుకోసం భవిష్యత్తు ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టడమే ప్రమాదం. పండుగ ముగిసినా అప్పుల భారం మాత్రం నెలల తరబడి వెంటాడుతుంది.

**బయటకు చెప్పలేని బాధ.. లోలోపల కుంగిపోతున్న బతుకులు!**
అప్పుల్లో ఉన్నామని బయటకు చెప్పుకోవడానికి చాలామంది సంకోచిస్తున్నారు. సాయం అడిగితే చిన్నచూపు చూస్తారనే భయం. ఆర్థిక పరిస్థితి తెలిస్తే గౌరవం తగ్గుతుందనే ఆందోళన వారిని మౌనంగా ఉంచుతున్నాయి. ఇంట్లో ఆర్థిక సమస్యలు కుటుంబ సభ్యుల మధ్య గొడవలకు, మానసిక ఒత్తిడికి కారణమవుతున్నాయి. పిల్లల అవసరాలు తీర్చలేక తల్లిదండ్రులు కుమిలిపోతుంటే. అప్పుల చెల్లింపుల ఒత్తిడితో కుటుంబ ప్రశాంతత దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో అప్పుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ బాధ్యతారాహిత్యంతో నిందించడం సరికాదు. తక్కువ ఆదాయం, పెరుగుతున్న జీవన వ్యయం, ఉపాధి అనిశ్చితి కూడా అనేక కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి.

**అప్పుల వల నుంచి బయటపడేదెలా?**
ఆదాయం ఎంత? తప్పనిసరి ఖర్చులెంత? నెలకు చెల్లించాల్సిన వాయిదాలెన్ని? అనే లెక్కలు ప్రతి కుటుంబానికీ స్పష్టంగా ఉండాలి. తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయకుండా కొత్త రుణాలు తీసుకోవడం, పాత అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయడం ప్రమాదకరం. చిట్టీల విషయంలోనూ నిర్వాహకుల విశ్వసనీయత, నిబంధనలు పరిశీలించాలి. అత్యవసర అవసరాల కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. మరోవైపు, పెరుగుతున్న ధరలు, అస్థిర ఉపాధి, తక్కువ ఆదాయాల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవాలి.
జీవితం అప్పులు తీర్చడానికా? కుటుంబంతో ప్రశాంతంగా బతకడానికా? ఈ ప్రశ్న ప్రతి ఇంట్లో వినిపించాలి. సంపాదనంతా ఈఎంఐలకు, పొదుపంతా చిట్టీలకు, మిగిలిన జీవితం అప్పుల ఆందోళనకు అంకితమైతే అభివృద్ధి సాధించినట్లా? వస్తువులు పెరిగినా మనశ్శాంతి తగ్గితే ఆ సౌకర్యాలకు అర్థమేంటి? ఆర్థిక స్థోమతకు మించి జీవించడం గౌరవం కాదు.. భవిష్యత్తును భారంగా మార్చుకోవడమే. ఈఎంఐలు అవసరాలను తీర్చే సాధనాలుగా ఉండాలి. బతుకును బంధించే సంకెళ్లుగా కాదు. చిట్టీలు పొదుపుకు మార్గం కావాలి. కుటుంబాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే ఉచ్చుగా మారకూడదు!



జర్నలిస్ట్ వార్త చైర్మన్
సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్

**వరంగల్ సూపర్ స్పెషాలిటీలో 20 నుంచి వైద్య సేవలు**

**డిసెంబరు ఆఖరుకల్లా పూర్తి స్థాయి సేవలు: పొంగులేటి**

**వరంగల్ /హైదరాబాద్, అక్టోబర్ 15జర్నలిస్టు జర్నీ న్యూస్**
పేదలకు ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా కార్పొరేట్ వైద్యసేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసీసరెడ్డి అన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా పేదలు ఇబ్బందులు పడకూడదని, ప్రతీ ఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంత్రి సీతక్క, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి.. మాట్లాడుతూ ఈ నెల 20న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పరిమిత వైద్య సేవలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నవంబరులో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి డిసెంబరు చివరికల్లా పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశం కోసం పోరాటం చేస్తున్నారని మంత్రి పొంగులేటి గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశప్రజల పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

# ‘ఎల్‌నినో’తో పొంచి ఉన్న కరవు



ఈ ఏడాది నైరుతి పవనాల సీజన్‌పై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపడంతో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై దక్షిణాది రాష్ట్రాల్లో తాగునీటికి కొరత ఏర్పడడమే కాకుండా, కరవు పరిస్థితులు తాండవిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. అయినప్పటికీ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు దక్షిణ భారతంలో ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురియవచ్చున్న ఆశ కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఒడిశాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. 2015 తరువాత ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాల తీరు చాలా బలహీనంగా కనిపించింది. ఎల్‌నినో బలపడుతుండడంతో వర్షపాతం మరింత తగ్గే పరిస్థితి కనిపిస్తోందన్న హెచ్చరికలు వెలువడ్డాయి. వర్షపాతం లోటు, అధిక వర్షానికి సంబంధించిన గణాంక అధ్యయనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. కరవు ప్రకటనలు చేయడానికి ఈ గణాంకాలు ప్రభుత్వానికి సహాయ పడతాయి. అయితే గణాంకాలు ఎంత ముఖ్యమైనా, వర్షాకాలం విఫలమైనప్పుడు కలిగే నష్టాలను తగ్గించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా చర్యలు తీసుకోకుంటే వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రస్తుత కరవు పరిస్థితులను ఎదుర్కోవడం అధికార యంత్రాంగానికి ఒక సవాలే. అయితే రాబోయే పరిస్థితులు మరింత కష్టతరంగా ఉంటాయని, సాధారణం కంటే ఎక్కువ వేడితో వేసవి వస్తుందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ సంవత్సరం ఏర్పడిన ఎల్‌నినోను కొందరు ‘సూపర్’, ‘సూపర్ డూపర్’ అని పిలుస్తున్నా గతంలో జరిగిన ఎల్‌నినోలతో పోలిస్తే ఈ ఎల్‌నినోతో అంతటి విపత్తు సంభవించకపోవచ్చు. ఉదాహరణకు బ్రిటిష్ పాలనా కాలంలో 1877లో సంభవించిన తీవ్రమైన కరువుకు ఎల్‌నినో కూడా ప్రధాన కారణమైంది. ప్రస్తుతం భారత దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తగినంత ఉన్నాయి. దేశంలో సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, బియ్యం నిల్వలు ఉన్నాయి. ఇది ప్రభుత్వం నిర్దేశించిన కనీస నిల్వల పరిమాణానికి మూడు రెట్లు ఎక్కువ. అందువల్ల వాతావరణ శాస్త్రవేత్తల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టుగా వరుసగా రెండో సంవత్సరం కూడా నైరుతి పవనాలు విఫలమైనా దేశంలో ఆహార కొరత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 ప్రాంతాలకు చెందిన భూభాగంలో, దేశం మొత్తం భూభాగంలో సుమారు 40 శాతం విస్తీర్ణానికి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించే విషయం. నైరుతి పవనాల సీజన్ అధికారికంగా అక్టోబర్ 30న ముగుస్తుంది. కానీ ఈలోగా దేశంలోని మొత్తం 741 జిల్లాల్లో 313 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు నమోదైంది. అంటే ఈ జిల్లాల్లో సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే 20 శాతం లేదా అంతకంటే తక్కువ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకున్నాయి. కర్ణాటకలో వర్షపాతం లోటు 35 శాతం కాగా, మొత్తం 240 తాలూకాల్లో 217 తాలూకాలను కరవు ప్రాంతాలుగా కర్నాటక ప్రకటించింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నుంచి రూ. 11,000 కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 53 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆ రాష్ట్రంలోని మొత్తం 688 మండలాల్లో 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. అంతర్ మంత్రిత్వశాఖల బృందం ఆయా రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నప్పుడు పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా సహాయం అందజేయవలసిన అవసరం ఉంది. కానీ ప్రస్తుత కరవు పరిస్థితులకు ఎల్‌నినో ఎంతవరకు ప్రత్యక్ష కారణమో, దాని ప్రభావం ఎంత బలంగా ఉందో శాస్త్రీయంగా వివరించే అధ్యయనం ఇంకా పూర్తి కాలేదు. గతంలో కరవు ప్రకటనలు తరచుగా అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలు, అంచనాలపై ఆధారపడి ఉండేవి. కానీ 2009 సంవత్సరం నుంచి కరవు నిర్వహణ మాన్యువల్, దానికి చేసిన సవరణలు, ఆర్థిక సంఘాల నిర్ణయాలు కరువు ప్రకటనల ప్రక్రియను మరింత కఠినతరం చేశాయి. గతంలో ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం విడుదల చేయడంలో కేంద్రం అనేక సార్లు తీవ్ర జాప్యం చేయడమే కాక, సహాయం అందించడానికి నిరాకరించే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2024లో కర్ణాటక విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైంది. రాష్ట్రప్రభుత్వాలే తమ సొంత నిధులను వెచ్చించుకోవలసి వచ్చింది. కేంద్ర బృందం పరిశీలించిన తరువాత కూడా సాయం అందించడంలో మొండి చెయ్యిచూపడం తగదు. రాష్ట్రాలను ఇబ్బందుల పాలు చేయడం, సహాయం అందించడంలో అనవసరమైన అడ్డంకులు సృష్టించే విధానాలు మానుకోవాలి. సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉన్నప్పుడు కరవును తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా రాష్ట్రాలను ఆదుకోవడానికి సిద్ధం కావాలి. రైతుల అప్పుల భారాన్ని తగ్గించడం, భూమి యాజమాన్యం లేని రైతులు, వ్యవసాయ కూలీలకు సహాయం అందజేయడం రాష్ట్రాల బాధ్యత అయినప్పటికీ రాష్ట్రాలకు ఆ మేరకు నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. కరవు సమస్యను ఎదుర్కోవడానికి కేవలం పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులపై ఆధారపడకుండా, నీటి సంరక్షణ, తక్కువ నీటితో పండే పంటలు, వ్యవసాయ బీమా, రైతులకు ఆర్థిక సాయం వంటి స్థిరమైన పరిష్కారాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి.

# పబ్‌లో పోలీసులతో గొడవ..

## ఐఏఎస్ అధికారిని బదిలీ చేసిన ఏపీ ప్రభుత్వం



బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసులతో గొడవపడిన ఘటనలో ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌పై బదిలీ వేటు పడింది. ‘కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ‘ (కాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను వెంటనే బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. ‘కాడా‘ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్టుకు వెంటనే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అక్టోబర్ 10న తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో బెంగళూరులోని రెసిడెన్సీ రోడ్డులో ఉన్న ఓ పబ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, వయసు నిర్ధారణ కోసం కస్టమర్ల గుర్తింపు పత్రాలు అడిగారు. ఈ క్రమంలో వికాస్ మర్మత్, ఆయన స్నేహితులు పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని దూషించి విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు మేరకు బెంగళూరు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు అభయ్ ఉదయ్ సింగ్, నితేష్, రోషన్ అనే మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం, బెదిరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# ఇది ఇంతటితో ఆగేలా లేదు!



గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం’ అనే పచ్చి సామెతను తలపిస్తోంది దేశంలో ప్రస్తుత పరిస్థితి. ‘సర్’ ప్రక్రియపై మొదట్నుంచి అనుమానాలున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీల ఎన్నికల సందర్భంగా విపక్షాలనుంచి ఎన్నో విమర్శలు, నిర్దిష్ట ఆరోపణలు వచ్చినప్పటికీ ఎన్నికల కమిషన్ చర్యల్ని తప్పుబట్టగల ఆధారాలు అప్పట్లో లేవు. ఇప్పుడిప్పుడే ఒకటొకటిగా అన్నీ బయటకు వస్తున్నాయి. ఇసిలో ఏకాభిప్రాయం లేదని, సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలే ఏడాది కాలంగా అమలవుతున్నాయన్న మీడియా పరిశోధనాత్మక కథనం తర్వాత నిరసన దేశవ్యాప్తంగా పెల్లుబికింది. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యార్థులు, యువతరం, మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు.. ఇలా విభిన్న వర్గాల వారు ఏకకంఠంతో గొంతెత్తారు. ముంబై, కోల్‌కతా, హైదరాబాద్.. ఇలా పెద్ద నగరాలకూ నిరసన వేడి విస్తరించింది. సిఇసి దిగిపోవాలని, ‘సర్’ రద్దు చేయాలని, చట్టవ్యతిరేక ‘సర్’ అమలుతో జరిగిన తప్పుడు ఎన్నికల్ని సమీక్షించాలన్న డిమాండ్‌ను నిరసనకారులు తెరపైకి తెచ్చారు. ప్రజాందోళన రోజోరోజుకు బలపడుతూ వచ్చింది. ఢిల్లీలో నిరసన అణచివేత చర్యల్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. పోలీసులకు పట్టినట్టు లేదు. కోర్టు చెప్పినా నిర్బంధ ఒరవడి ఇంకా కొనసాగుతూనే ఉంది. రద్దు చెల్లుబాటయ్యేనా? దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరపడాన్ని పూర్తిగా నిషేధిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటవుతాయా? న్యాయ సమీక్షకు అవి నిలుస్తాయా? అన్నది ఇప్పుడు ప్రశ్న. రద్దు నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా ఆ ప్రదేశంలో చేరి, నిరసన తెలపడానికి యత్నించిన సిజెపి కార్యకర్తలు, ఇతర నిరసనకారుల్ని పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలపడం పౌరుల ప్రజాస్వామిక హక్కు అని, వారిని నిర్బంధించకూడదని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు లెక్కచేయలేదు. ‘జంతర్ మంతర్ వద్ద నిరసనల్ని నిషేధించాం కనుక అడ్డుకున్నాం’ అన్నది పోలీసుల ధీమా కావచ్చు. కానీ, అలా ఏకపక్షంగా నిరసనల్ని పూర్తిగా నిషేధించి, నిరసన స్థలాన్ని ఉన్న పళంగా మార్చడం సరికాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం లోగడ తీర్పు చెప్పింది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, ఇందిరా పార్కు సమీపంలోని ‘ధర్నా చౌక్’ను ఎత్తివేసి, నగర శివార్లకు బదలాయించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యని హైకోర్టు 2018 నవంబర్‌లో తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన ‘ధర్నా చౌక్’ని కోర్టు పునరుద్ధరించింది. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, వి.హన్మంతరావు (కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి (సిపిఐ) తదితరుల ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుమోటోగా స్వీకరించిన హైకోర్టు, ప్రభుత్వ చర్యల్ని తప్పుబట్టింది. ధర్నా చౌక్ పునరుద్ధరణకు ముందు, తర్వాత కూడా పలుమార్లు న్యాయస్థానం కల్పించుకొని, పౌరుల నిరసనలకు ప్రత్యేకంగా అనుమతులు ఇప్పించింది. ట్రాఫిక్ అంతరాయాలు, స్థానికుల అసౌకర్యాలను పోలీసులు తమ నిర్ణయానికి కారణంగా చూపినప్పటికీ కోర్టు అంగీకరించలేదు. తమ అసంతృప్తిని వ్యక్తపరచడానికి, అందుకు శాంతియుతంగా గుమిగూడడానికి పౌరులు రాజ్యాంగబద్ధమైన హక్కును కలిగి ఉన్నారని హైకోర్టు ధర్మాసనం నవంబరు 2018 తీర్పులో స్పష్టం చేసింది. తాజా ఢిల్లీ పరిణామాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు, రోడ్ల దిగ్బంధనం, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత, తీవ్ర నిర్బంధం వంటి సర్కారు చర్యల్ని సుప్రీం కోర్టు కూడా తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించకూడదని స్పష్టం చేసింది. అయినా పోలీసులు నిరసనకారుల్ని అడ్డుకుంటూనే ఉన్నారు. జంతర్ మంతర్‌కు బదులు, దూరం గా మూడు స్థలాలను (రాంలీలా మైదాన్, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీ సిబిడి (గ్రౌండ్) ధర్నాలకు, నిరసనలకు ప్రత్యామ్నాయంగా చూపించామని ప్రభుత్వ పెద్దలంటున్నారు. దారులు మూయడమే ! ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థల్లో కొన్ని సమస్యలకు సంప్రదాయకమైన పరిష్కార పద్ధతులున్నాయి. అందులో సంప్రదింపులు, చర్చల ప్రక్రియ ఒకటి. ఆ పంథాకు పాలకులు మెలమెల్లగా దారులు మూసేస్తున్నారు. ఎవరితో చర్చించాలి? ఏం చర్చించాలి? అనే పెడసరపు మాటలు చెబుతున్నారు. ఏదైనా కీలక ప్రజా సంబంధ విషయంలో నిరసనకారులకు, సర్కారుకు మధ్య సయోధ్య బెడిసి, ఎడం పెరిగి, ప్రతిష్టంభన ఏర్పడినపుడు చర్చల ప్రక్రియ సాగేది. ప్రభుత్వం తరపున కొందరు పెద్దలు, నిరసన ఆందోళన కారుల తరపున కొందరు చర్చల్లో పాల్గొనేది. ఆ ఆనవాయితీయే కనుమరుగవుతోంది. అంతెందుకు నిన్నటికి నిన్న ‘నీట్’ పేపర్ లీక్ నిరసనల సందర్భంగా పరిస్థితి విషమించినప్పుడు కేంద్ర మంత్రులు చొరవ తీసుకొని సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపారు. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ కార్యరూపం దాల్చి నిరసన ఉపసంహరణ అన్నది సదరు చర్చల ఫలితంగా జరిగిందే! మరి తాజా వివాదంలో.. పరిస్థితి ఇంతదాకా వస్తుందని సర్కారు వ్యూహకర్తలు ముందు భావించినట్టు లేదు. ఇసిలో జరిగిన తప్పిదాలను గుర్తించడానికి, గుర్తించినా అంగీకరించడానికి సిద్ధపడలేదు. దాంతో తప్పును సరిదిద్దుకునే ఆలోచనే చేయడం లేదు. ఫలితంగా సమస్య పరిష్కారమయ్యే సూచనలు కనబడటం లేదు. శాంతియుత నిరసన హింస కిందకు మళ్లే ఆస్కారం లేనపుడు కూడా పోలీసులు కర్కశంగా నిరసనల్ని అణచివేస్తున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. సందర్భాన్ని, సన్నివేశాన్ని రిపోర్టు చేస్తున్న మీడియా ప్రతినిధులు, రిపోర్టర్లను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రత్యర్థుల కింద జమచేస్తున్నారు. అదే సమయంలో సివిల్ దుస్తుల్లో వుండి లాఠీలతో నిరసనకారులపై దాడిచేస్తూ రెచ్చిపోతున్న వారిని, కార్లలో లాఠీలు, ఇతర ఆయుధాలతో నిరసన స్థలిలో తచ్చాడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్టు ఉపేక్షిస్తున్నారు. దీనిపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శాంతి భద్రతల్ని కాపాడే తమ ప్రాథమిక బాధ్యతల్ని పోలీసులు ఔట్ సోర్సింగ్ చేశారా? కిరాయి గూండాల్ని అద్దెకు తెచ్చుకున్నారా? అనే వ్యంగ్య వ్యాఖ్య లూ ప్రజాక్షేత్రంలో వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిచ్చి, పెడపోకడలకు పాలకులు పీటలు వేస్తున్నారని సామాజికవేత్తలు విమర్శిస్తున్నారు. చట్టబద్ధ పాలన (రూల్ ఆఫ్ లా)కు కట్టుబడాల్సిన పోలీసులు సర్కారు కట్టుబానిసల్లా పనిచేయడమేకాక విధి నిర్వహణల్లో ఉన్న జర్నలిస్టుల్ని కూడా ఆందోళన, నిరసనకారుల్లో జమచేసే దారుణానికి ఒడిగడుతున్నారు. ఇది ఎంతో ప్రమాదకరం. విపక్షాల ఆరోపణలు నిరాధారం, నిందా పూర్వకం అని ఇంతకాలం పెద్దగా పట్టించుకోని అతి సామాన్యులు కూడా ఈ రోజు సర్కారు వారి నిర్వాకాలను సందేహిస్తున్నారు. ఏదో లేకుంటే పరిస్థితి ఇంతదాకా వస్తుందా? ‘దానేమే కుచ్ కాలా హై..! అని బలంగా నమ్ముతున్న పరిస్థితి అంతటా అలుముకుంటోంది. రాజ్యాంగ హక్కుల రక్షణకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు సమాజం మరింత వ్యవస్థీకృతంగా, బలంగా కదిలే సూచనలు కనబడుతున్నాయి. రాజ్యమా తస్మాత్ జాగ్రత్త!

# కల్తీకి అయ్యే ఖర్చెంత?



మనిషి బతకడానికి తిండి కావాలి. తాగడానికి నీళ్లు, శ్వాసించడానికి గాలి కావాలి. ఆరోగ్యానికి పాలు, పోషణకు పండ్లు కావాలి. ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన వరాలు. కానీ ఇప్పుడు వీటిలో ఏది స్వచ్ఛమైనది? ఏది నిర్భయంగా తినదగినది? ఏది నిశ్చింతగా తాగదగినది? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితి నెలకొంది. ఆకలి తీర్చే ఆహారమే అనారోగ్యానికి మూలమైతే, దాహం తీర్చే నీరే రోగాలను ఆహ్వానిస్తే, ప్రాణ వాయువే ఆరోగ్యానికి శత్రువైతే మనిషి తన మనుగడను ఎక్కడ వెతుక్కోవాలి? అసలు కల్తీకి అయ్యే ఖర్చెంత? లీటరు పాలలో నీళ్లు కలపడానికి అయ్యే ఖర్చెంత? నూనెలో నాణ్యతలేని పదార్థాలు కలిపి అమ్మడానికి పెట్టుబడెంత? పండ్లను కృత్రిమంగా మగ్గించడానికి వ్యయమెంత? ఆహార పదార్థాలకు ఆకర్షణీయమైన రంగులు అద్ది, వాటి అసలు స్వరూపాన్ని దాచడానికి ఖర్చెంత? కల్తీ ద్వారా వచ్చే అదనపు ఆదాయం ఎంత? ఈ లెక్కలన్నీ వేసుకునే వ్యాపారులు, ఆ కల్తీ వల్ల ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాన్ని ఎందుకు లెక్కించరు? పాల కల్తీ మరింత ఆందోళనకరమైన అంశం. సహజమైన పాలను పోలిన రూపం, చిక్కదనం తీసుకురావడానికి యూరియా, డిటర్జెంట్లు, ఇతర రసాయనాలను ఉపయోగించి కృత్రిమ పాలు తయారు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. యూరియా వ్యవసాయానికి ఉపయోగపడే పదార్థమే అయినా, దానిని పాలలో కలిపి వినియోగించడం ప్రమాదకరం. పోషకాహారంగా భావించి పిల్లలకు ఇచ్చే పాలే హానికరమైన మిశ్రమంగా మారితే తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి? పసిపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంతో చెలగాటమాడే ఈ దుర్మార్గాన్ని అరికట్టడానికి నిరంతర తనిఖీలు, శాస్త్రీయ పరీక్షలు, కఠిన చర్యలు ఎందుకు సమర్థంగా అమలుకావడం లేదు? కల్తీ వ్యాపారికి అది లాభం కావచ్చు. వినియోగదారుడికి మాత్రం కనిపించని నష్టం. లాభం ఒకరి జేబులో చేరితే, నష్టం మరొకరి ఆరోగ్యంపై పడుతోంది. కల్తీ ద్వారా సంపాదించిన డబ్బు వ్యాపారికి మిగులుతుంది. అనారోగ్యంతో బాధపడే వ్యక్తి మాత్రం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ సంపాదనను కోల్పోతాడు. కుటుంబం వైద్య ఖర్చులతో ఆర్థికంగా కుంగిపోతుంది. నాణ్యతను పణంగా పెట్టి లాభాలు పెంచుకోవడం వ్యాపార చాతుర్యం కాదు; ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే దురాశ. కల్తీ సమస్య పాలకో, నూనెకో పరిమితమై ఉంటే నియంత్రించడం సులభమయ్యేది. కానీ పండ్లు సహజంగా పండాయా, కృత్రిమంగా మగ్గించారా అన్న సందేహం. కూరగాయల్లో రసాయనాల అవశేషాలున్నాయా అన్న భయం. తాగునీటిలో పారిశ్రామిక వ్యర్థాలు చేరాయా అన్న ఆందోళన. మరోవైపు వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణాల ధూళి గాలిని కలుషితం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వక కల్తీ, నాణ్యతా లోపం, పర్యావరణ కాలుష్యం వేర్వేరు సమస్యలే అయినా, వాటి ప్రభావం చివరకు ప్రజల ఆరోగ్యంపైనే పడుతోంది. తినే పదార్థం నుంచి పీల్చే గాలి వరకు అనుమానించాల్సి వస్తే, ఆధునిక జీవితం మనకు అందిస్తున్న భద్రత ఏమిటి? స్వచ్ఛమైన వస్తువును ఎంచుకోవడానికి కూడా అదనంగా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి మరో విషాదం. సేంద్రియ పద్ధతుల్లో పండించామని చెప్పే ఉత్పత్తులు అధిక ధరలకు అమ్ముడవుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం సంపన్నుల ప్రత్యేక హక్కుగా మారాలా? నాణ్యమైన ఆహారం కొనలేని పేదవాడు కల్తీకి బలి కావాల్సిందేనా? స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం కోసం ప్రజలు అదనపు వ్యయం చేయాల్సి రావడం అభివృద్ధికి నిదర్శనమా? లేక అభివృద్ధి నమూనాలోని లోపాలకు అద్దమా? ప్రకృతిలో కల్తీలేని వస్తువులు లభించడం అసాధ్యమేమీ కాదు. ఆరోగ్యకరమైన నేల, కలుషితం కాని నీరు, బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులు స్వచ్ఛమైన ఆహారానికి పునాదులు. పంట పండిన తర్వాత నిల్వ, రవాణా, విక్రయాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. సేంద్రియమనే ముద్ర ఉన్నంత మాత్రాన ప్రతి వస్తువూ సురక్షితమని భావించకుండా, శాస్త్రీయ పరీక్షలు, ధ్రువీకరణకు ప్రాధాన్యమివ్వాలి. ప్రకృతిని కాపాడకుండా స్వచ్ఛతను ఆశించడం సాధ్యం కాదు. ప్రభుత్వ బాధ్యత ఇక్కడ అత్యంత కీలకం. ఆహార భద్రతా చట్టాలు కాగితాలకే పరిమితం కాకూడదు. కల్తీని గుర్తించే ప్రయోగశాలలు, నిపుణులు, తనిఖీ వ్యవస్థలు బలోపేతం కావాలి. పరీక్షా ఫలితాలు వేగంగా వెల్లడించాలి. నేరాలకు పాల్పడినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. కల్తీ పదార్థాలను మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలి. పలుకుబడి ఉన్నవారు తప్పించుకునే అవకాశాలు లేకుండా చూడాలి. ప్రజల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను బహిరంగపరచాలి. తనిఖీలు అప్పుడప్పుడు జరిగే తంతుగా కాకుండా నిరంతర పర్యవేక్షణలో భాగం కావాలి. ప్రజల అప్రమత్తత కూడా అవసరమే. ప్యాకేజీలపై తయారీ, గడువు, నాణ్యతా వివరాలను పరిశీలించాలి. అనుమానాస్పద పదార్థాల గురించి అధికారులకు తెలియజేయాలి. అయితే వినియోగదారుడి జాగ్రత్త మాత్రమే పరిష్కారం కాదు. ఏది కల్తీ, ఏది స్వచ్ఛమో గుర్తించే శాస్త్రీయ సామర్థ్యం అందరికీ ఉండదు. నాణ్యతను నిర్ధారించే వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ బాధ్యత; దాన్ని కాపాడటం ఉత్పత్తిదారుల బాధ్యత.

# 2027 ప్రపంచకప్ తర్వాత క్రికెట్‌కు సికందర్ రజా వీడ్కోలు!



**రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గేది లేదంటున్న జింబాబ్వే కెప్టెన్**

**ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అవకాశం వచ్చినా నిర్ణయం మారదని స్పష్టం**

**హరారే:** జింబాబ్వే స్టార్ ఆల్‌రౌండర్, వన్డేలు, టీ20 జట్ల కెప్టెన్ సికందర్ రజా తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికే విషయంపై కీలక ప్రకటన చేశాడు. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ అనంతరం క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నట్లు స్పష్టం చేశాడు. తన నిర్ణయాన్ని మార్చుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. 2027 ప్రపంచకప్‌కు జింబాబ్వే, దక్షిణాఫ్రికా, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. సొంత గడ్డపై జరిగే ప్రపంచకప్‌లో ఆడిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడం తనకు ప్రత్యేకమైన అవకాశమని రజా పేర్కొన్నాడు. ప్రపంచకప్ ఆడి రిటైర్మెంట్ తీసుకోవడం ప్రతి క్రికెటర్ కల అని అభిప్రాయపడ్డాడు. **టెస్టు ఛాంపియన్‌షిప్ వచ్చినా అంతే!** 2027–30 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చక్రంలో జింబాబ్వేకు చోటు దక్కినా తన రిటైర్మెంట్ నిర్ణయంలో మార్పు ఉండదని రజా స్పష్టం చేశాడు. తన కెరీర్‌కు సంబంధించి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నానని, దాని నుంచి వెనక్కి తగ్గబోనని వెల్లడించాడు. అయితే జింబాబ్వేకు డబ్ల్యూటీసీలో ఆడే అవకాశం లభిస్తే ఆ దేశ క్రికెట్ అభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రజా ఆశాభావం వ్యక్తం చేశాడు. టెస్టు క్రికెట్ వల్ల ఆటగాళ్ల నైపుణ్యం పెరుగుతుందని, అన్ని ఫార్మాట్లలోనూ జట్టు ప్రదర్శన మెరుగుపడుతుందని పేర్కొన్నాడు. **యువ ఆటగాళ్లపై ఆశలు** తన కెరీర్ ముగిసిన తర్వాత జింబాబ్వే క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లే సత్తా యువ ఆటగాళ్లకు ఉందని రజా విశ్వాసం వ్యక్తం చేశాడు. బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్, బౌలర్ న్యూమన్ న్యామ్హురి భవిష్యత్తులో జట్టు కీలక ఆటగాళ్లుగా ఎదుగుతారని అంచనా వేశాడు. 2027 ప్రపంచకప్ తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి ప్రధాన ఘట్టం కానుండటంతో, సొంత ప్రేక్షకుల మధ్య చిరస్మరణీయ ప్రదర్శనతో వీడ్కోలు పలకాలని రజా భావిస్తున్నాడు.

# న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు బుమ్రా దూరం!



**టెస్టుల కోసం స్టార్ పేసర్‌కు విశ్రాంతి**

**పనిభారాన్ని తగ్గించడమే టీమ్ మేనేజ్‌మెంట్ లక్ష్యం**

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశముంది. రాబోయే టెస్టు సిరీస్‌పై దృష్టి సారించడంతో పాటు, బుమ్రా పనిభారాన్ని నియంత్రించేందుకు భారత జట్టు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. బుమ్రా ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నప్పటికీ, సుదీర్ఘ పర్యటనలో వరుసగా అన్ని ఫార్మాట్లలో ఆడించడం కంటే టెస్టులకు సిద్ధం చేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ నవంబర్ 19 నుంచి ప్రారంభం కానుంది. **ఇండియా–ఏ తరఫున బరిలోకి?** టెస్టు సిరీస్‌కు ముందు బుమ్రా మ్యాచ్ ప్రాక్టీస్ పొందేలా ఇండియా–ఏ జట్టు తరఫున ఒక బహుళ రోజుల మ్యాచ్‌లో ఆడించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే ఇండియా–ఏ మూడో మ్యాచ్‌లో అతడిని ఆడించాలని యోచిస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. **టెస్టులే లక్ష్యంగా ప్రణాళిక** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పోటీలో కీలకంగా మారనున్న టెస్టు సిరీస్‌లతో పాటు, వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రా పనిభారాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు సంబంధించి బుమ్రా ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, అతడిని వన్డేలకు దూరంగా ఉంచడం గాయంతో సంబంధం లేని నిర్ణయంగా కనిపిస్తోంది.

# తిలక్ ఔటవ్వడమే ఓటమికి ప్రధాన కారణం!

- **భారత ఓటమిపై స్పందించిన సంజూ శాంసన్**
- **యువ బౌలర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని సూచన**



**హైదరాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో అంతర్జాతీయ టీ20 క్రికెట్ పోటీలో భారత జట్టు ఓటమికి తిలక్ వర్మ వికెట్ కీలక మలుపుగా మారిందని భారత క్రికెటర్ సంజూ శాంసన్ అభిప్రాయపడ్డాడు. ఈ పోటీలో భారత్ 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఐదు పోటీల సిరీస్ 2–2తో సమమైంది. **కీలక సమయంలో వికెట్ కోల్పోవడంతో దెబ్బ** తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 247 పరుగులు సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టు 223 పరుగులకే ఆలౌటైంది. సంజూ శాంసన్ 23 బంతుల్లో 56 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. అనంతరం తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత జట్టును విజయానికి చేరువ చేసే ప్రయత్నం చేశారు. అయితే కీలక సమయంలో తిలక్ వర్మ ఔటవడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయిందని సంజూ పేర్కొన్నాడు. ఆ వికెట్ జట్టు విజయావకాశాలను దెబ్బతీసిందని తెలిపాడు. **యువ బౌలర్లకు ప్రోత్సాహం అవసరం** భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ప్రత్యామ్నాయం దొరకడం సులభం కాదని సంజూ అభిప్రాయపడ్డాడు. బుమ్రా వంటి ప్రతిభావంతులు అరుదుగా ఉంటారని పేర్కొన్నాడు. అదే సమయంలో యువ బౌలర్లకు తగినన్ని అవకాశాలు కల్పిస్తే వారు తమ ప్రతిభను నిరూపించుకోగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. **చివరి పోటీలో గెలుపే లక్ష్యం** ఒక్క పోటీలో విఫలమైనంత మాత్రాన యువ ఆటగాళ్ల సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయకూడదని సంజూ సూచించాడు. జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారని, కీలక సమయంలో తప్పిదాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలని పేర్కొన్నాడు. సిరీస్ విజేతను నిర్ణయించే చివరి పోటీలో భారత్ మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది.

# భారత ఓటమికి బౌలర్లే కారణం!

**ఇదే బౌలింగ్‌తో ప్రపంచకప్ గెలవడం కష్టమే!**

**మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 క్రికెట్ పోటీలో భారత జట్టు ఓటమికి బౌలర్ల వైఫల్యమే ప్రధాన కారణమని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతోనే భారత్ విజయానికి దూరమైందని పేర్కొన్నాడు. ఇదే తరహా ప్రదర్శన కొనసాగితే ప్రపంచకప్ గెలవడం కష్టమని వ్యాఖ్యానించాడు. **పరుగుల వరదను అడ్డుకోవడంలో విఫలం!** తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 247 పరుగులు సాధించింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 223 పరుగులకే పరిమితమైంది. దీంతో 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. వెస్టిండీస్ జట్టు సారథి షాయ్ హోప్ అజేయ శతకంతో చెలరేగగా, భారత బౌలర్లు పరుగులను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. **బౌలింగ్‌లో మెరుగుపడాలి** భారత జట్టు విజయాల కోసం కేవలం బ్యాటర్లపైనే ఆధారపడటం సరికాదని కైఫ్ అభిప్రాయపడ్డాడు. బ్యాటర్లు పరుగులు సాధించినప్పటికీ, బౌలర్లు ప్రత్యర్థి జట్టును కట్టడి చేయలేకపోతే విజయాలు సాధించడం కష్టమని పేర్కొన్నాడు. కీలక సమయాల్లో వికెట్లు తీయడంతో పాటు పరుగుల వేగాన్ని తగ్గించడంపై బౌలర్లు దృష్టి సారించాలని సూచించాడు. **ప్రపంచకప్‌కు ముందే లోపాలు సరిదిద్దుకోవాలి** ప్రపంచకప్ వంటి కీలక పోటీల్లో రాణించాలంటే భారత బౌలింగ్ విభాగం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కైఫ్ పేర్కొన్నాడు. బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ తప్పిదాలను తగ్గించుకోవాలని సూచించాడు. రాబోయే పోటీల్లో ఈ లోపాలను సరిదిద్దుకుని భారత జట్టు విజయాల బాట పట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆసీస్ పేస్ దళం బలానికి కారణమిదే!

- **ఆస్ట్రేలియా బౌలింగ్ బలంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ విశ్లేషణ**



**హైదరాబాద్:** ఆస్ట్రేలియా వేగవంతమైన బౌలింగ్ విభాగం ప్రపంచ క్రికెట్‌లో బలమైనదిగా నిలవడానికి అనుభవం, క్రమశిక్షణ, సమష్టి కృషే ప్రధాన కారణాలని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వంటి స్టార్ బౌలర్లు తమ నైపుణ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కొత్త బంతితో వికెట్లు తీయడంతో పాటు, పాత బంతితోనూ పరుగులను కట్టడి చేయగలరని తెలిపాడు. వేగం, బంతిని స్వింగ్ చేయడం, కచ్చితమైన బంతులు వేయడం వంటి విభిన్న నైపుణ్యాలు ఆ జట్టుకు అదనపు బలంగా మారాయని వివరించాడు. కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకుని ప్రణాళిక ప్రకారం బౌలింగ్ చేయడం ఆస్ట్రేలియా బౌలర్ల ప్రత్యేకతని పేర్కొన్నాడు. అనుభవజ్ఞులైన బౌలర్లు ఒకరికొకరు అండగా నిలుస్తూ జట్టుకు విజయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డాడు.

# 140 కోట్ల భారతీయులు గర్వించేలా చేశారు!

**- భారతీయుల ప్రశంసలు అందుకున్న ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:** దేశ ప్రజల ఆశీస్సులు, సమష్టి కృషితో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. యువత, మహిళలు, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన నుంచి సాంకేతిక రంగంలో మార్పుల వరకు అనేక రంగాల్లో భారత్ ముందడుగు వేస్తోందని తెలిపారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా సేవ, సుపరిపాలన, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. దేశ ప్రజల సహకారంతో మరిన్ని విజయాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.



# విరాట్ కోహ్లీకి సత్య నాదెళ్ల అభినందనలు!

- **కోహ్లీ కొత్త వ్యాపార ప్రయాణానికి స్వాగతం**
- **సామాజిక మాధ్యమంలో క్రికెట్ దిగ్గజానికి మైక్రోసాఫ్ట్ అధినేత ప్రశంసలు**

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీకి మైక్రోసాఫ్ట్ సంస్థ అధినేత సత్య నాదెళ్ల అభినందనలు తెలిపారు. కోహ్లీ సామాజిక మాధ్యమ వేదికలో తొలిసారిగా సందేశం పంచుకోవడంపై స్పందిస్తూ, ఆయన కొత్త వ్యాపార ప్రయాణానికి స్వాగతం పలికారు. ఈ స్పందన క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. **కోహ్లీకి ఘన స్వాగతం** విరాట్ కోహ్లీ కొత్త వ్యాపార ప్రయత్నాలను అభినందిస్తూ సత్య నాదెళ్ల సందేశం పంపారు. కోహ్లీ రాకతో తన సందేశాల విభాగం మరింత ఆసక్తికరంగా మారిందని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన కొత్త ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. **క్రీడా రంగంలో కొత్త లక్ష్యం** భారతదేశంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం లభించాలని, దేశీయ క్రీడా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావాలని విరాట్ కోహ్లీ ఆకాంక్షించారు. భారతదేశం నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే క్రీడా వ్యాపార సంస్థలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. క్రీడా వస్తువుల తయారీ, వాటి విక్రయాలు, పంపిణీ రంగాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నది తన ఆశయమని తెలిపారు. క్రికెట్‌లో ఎన్నో విజయాలు సాధించిన కోహ్లీ, వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. **వ్యాపార రంగంలోనూ కోహ్లీ అడుగులు** క్రికెట్ మైదానంలో తన ప్రతిభతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న కోహ్లీ, ఇప్పుడు క్రీడా వ్యాపార రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆయన ప్రయత్నాలకు సత్య నాదెళ్ల అభినందనలు తెలపడం విశేషంగా నిలిచింది.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



## 'సంబరాల ఏటిగట్టు'లో సాయిదుర్గాతేజ్ పాత్ర రివీల్.. 'బాలి'గా సరికొత్త అవతారం!

మెగా సుప్రీమ్ హీరో సాయిదుర్గాతేజ్ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే కానుక ఇచ్చింది. అతడు హీరోగా రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'లో తేజ్ పోషిస్తున్న పాత్రను వెల్లడించింది. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈ అప్‌డేట్ ఇచ్చింది. సినిమాలో అతడు 'బాలి' పాత్రలో కనిపించనున్నాడు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో చేతిలో కత్తి, డాలు పట్టుకుని, వెనుక గూడ్స్ రైలు ఉన్నట్లు కనిపించే నేపథ్యంతో తేజ్ యుద్ధవీరుడిలా దర్శనమిచ్చాడు. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సోషల్ మీడియాలో తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. 'వేటగాడు.. యోధుడు.. మృగం' అంటూ ఆయన పాత్రపై ఆసక్తి పెంచేలా పోస్ట్ చేసింది. వచ్చే సంక్రాంతికి వెండితెరపై ఆయన సరికొత్త రూపాన్ని చూడబోతున్నారని పేర్కొంది.

'సంబరాల ఏటిగట్టు' చిత్రాన్ని 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. గత నెలలో డబ్బింగ్ పనులను పూజా కార్యక్రమాలతో ప్రారంభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.125 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఇది సాయిదుర్గాతేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్టుగా నిలవనుంది.

రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తుండగా.. జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్, అనన్య నాగళ్ల, రవికృష్ణ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గతంలో ఈ సినిమా కోసం జాతీయ అవార్డు గ్రహీత, స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. సినిమాలో ఓ బాలీవుడ్ స్టార్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారనే ప్రచారం కూడా ఉంది. అయితే ఆ నటుడి వివరాలను చిత్రబృందం అధికారికంగా వెల్లడించలేదు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. వెట్రి పళనిసామి కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. నవీన్ విజయకృష్ణ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు




## ఎక్కడ చూసినా 'రణబాలి' ముచ్చటనే!



కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా 'రణబాలి' సినిమాను గురించే అంతా మాట్లాడుకుంటున్నారు. అందుకు కారణం ఈ కథా నేపథ్యం .. విజయ్ దేవరకొండ - రష్మిక విలక్షణమైన లుక్ .. అనే చెప్పాలి. సాధారణంగా ఒక కథకు చరిత్ర తోడైనా .. ఒక పోరాటానికి ప్రేమ తోడైనా ఆ కథపై అందరిలో మరింత ఆసక్తి కలుగుతుంది .. కుతూహలం పెరుగుతుంది. అయితే చరిత్ర .. పోరాటం .. ప్రేమ .. అనే ఈ మూడు అంశాలను కలుపుకుంటూ అల్లుకున్న కథగా 'రణబాలి' కనిపిస్తుంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా, రేపు థియేటర్లలో దిగిపోనుంది. రాహుల్ సాంకృత్యన్ ఇంతవరకూ తెరకెక్కించిన సినిమాలను ఒకసారి పరిశీలన చేస్తే, ఎప్పటికప్పుడు ఆయన ప్రయోగాల దిశగా అడుగులు వేయడం కనిపిస్తుంది. విభిన్నమైన కథాంశాలను ఎంచుకుంటూ .. వాటిని అందంగా ఆవిష్కరించుకుంటూ వెళ్లిన విధానం తెలుస్తుంది. అలా రూపొందిన సినిమానే 'రణబాలి'గా చెప్పుకోవచ్చు. ఇంతవరకూ విజయ్ దేవరకొండ - రష్మిక రెండు సినిమాలలో నటించినప్పటికీ, ఇది పూర్తిగా భిన్నమైనదిగా చెప్పుకోవలసి ఉంటుంది. పెళ్లి తరువాత వాళ్లు కలిసి చేసిన ఫస్టు మూవీగా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది ఆంగ్లేయుల కాలంలో .. అంటే 1870లలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిన కథగా చెబుతున్నారు. ఆంగ్లేయుల కాలంలో రాయలసీమ ప్రాంతంలో ఏర్పడిన కరవు .. ఆ పరిస్థితులలోను అక్కడి ప్రజల పట్ల వాళ్లు దారుణంగా ప్రవర్తించిన తీరు .. వాళ్ల ధోరణిని ధైర్యంగా ఎదిరించిన ఒక యోధుడి కథగా ఈ సినిమాను రూపొందించారు. డిఫరెంట్ లుక్ తో విజయ్ దేవరకొండ - రష్మిక ఆకట్టుకుంటున్న ఈ సినిమా, కొత్త రికార్డులు నమోదు చేయడం ఖాయమనే టాక్ బలంగా వినిపిస్తోంది

## రజనీ 'జైలర్ 2'.. తప్పకుండా చూడాలన్న ధనుశ్!



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. తొలి షో నుంచే ఈ చిత్రానికి విశేషమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా పలువురు సినీ ప్రముఖులు సినిమా చూసి సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ధనుశ్ ఈ సినిమాను "మస్ట్ మస్ట్ మస్ట్ వాచ్" మూవీ అని అన్నారు.

ఫస్ట్ డే ఫస్ట్ షో చూసిన వెంటనే తన 'ఎక్స్' ఖాతాలో స్పందించిన ధనుశ్.. ""జైలర్ 2' తప్పకుండా చూడాల్సిన సినిమా.. ఇది బ్లాక్‌బస్టర్.. తలైవా అభిమానులకు ఇదొక పండగ" అని పేర్కొంటూ ఫైర్ సింబల్స్ పోస్ట్ చేశారు. ధనుశ్ తో పాటు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, నటుడు విష్ణు విశాల్, నిర్మాత నాగవంశీ వంటి ప్రముఖులు కూడా సినిమాపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్పందిస్తూ.. "తెరపై తలైవా మంటలు పుట్టించారు. ఆయన నుంచి కళ్లు తిప్పుకోలేకపోయాను. గూస్‌బంప్స్ ఓవర్‌లోడెడ్ మాస్ బ్లాస్ట్ ఇది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ రైటింగ్, ఎగ్జిక్యూషన్ అద్భుతం. అనిరుధ్ తన సంగీతంతో ప్రతి ఫ్రేమ్‌కు ప్రాణం పోశారు. ఒకే సినిమాలో మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్, విద్యాబాలన్, హృతిక్ రోషన్, ఎస్‌జే సూర్య వంటి వారిని చూడటం అద్భుతంగా ఉంది" అని కొనియాడారు. తెలుగు నిర్మాత నాగవంశీ సైతం సినిమాపై ప్రశంసలు కురిపించారు. "సూపర్‌స్టార్ సినిమా విషయానికి వస్తే ఫస్టాఫ్, సెకండాఫ్ పోలికలకు తావులేదు. ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద పెద్ద ధమాకా ఖాయం. 'జైలర్ 2' ఆద్యంతం పీక్ మాస్ సంభవం లాంటి మూమెంట్స్‌తో నిండిపోయింది. ప్రతి యాక్షన్ బ్లాక్ అదిరిపోయింది. ఇది కుటుంబ ప్రేక్షకులకు పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్" అని అన్నారు. దర్శకుడు నెల్సన్ రజనీకాంత్‌ను ప్రజెంట్ చేసిన విధానం, కథ, భావోద్వేగాలు అన్నీ పక్కాగా కుదిరాయని తెలిపారు. అనిరుధ్ సంగీతం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "రజనీ సర్ స్క్రీన్‌పై వెలిగిపోతుంటే, అనిరుధ్ తన పాటలు, బీజీఎంతో ప్రతి క్షణాన్ని ప్యూర్ ఫైర్‌వర్క్స్‌లా మార్చేశాడు" అని పేర్కొన్నారు.

## మాస్టర్‌మైండ్ డెన్‌లో అడుగుపెట్టారు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకధీరుడు సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆర్‌సి 17' ప్రయాణం అధికారికంగా మొదలు కాబోతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తమ అధికారిక ఎక్స్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ సిని మా కోసం మాస్టర్‌మైండ్ డెన్‌లో అడుగుపెట్టారని పేర్కొంటూ.. సుకుమార్, నిర్మాత రవిశంకర్‌తో పాటు రచయితల బృందంతో కలిసి సినిమా ఆఫీస్‌లో ఉన్న ఫొటోను పంచుకుంది. త్వరలోనే పూజా కార్యక్రమాలతో 'ఆర్‌సి17' ప్రయాణం ప్రారంభమవుతుందని వెల్లడించింది. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు చిత్ర బృందం అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాన్ని ని ర్వహించాలని నిర్ణయించిందని తెలిసింది. అదే రోజు టైటిల్ లో గో, కాన్సెప్ట్ పోస్టర్ విడుదలయ్యే అవకాశం ఉందని టాక్. డి సెంబర్ మొదటి వారం నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందట. ఇది పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూ పొందనున్న గ్రామీణ నేపథ్యమున్న యాక్షన్ డ్రామా అని తెలిసింది. 2018లో వచ్చిన 'రంగస్థలం' బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్ చరణ్, - సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడంతో అభిమానుల్లో, ట్రేడ్‌వర్గాల్లో భారీ అంచనాలున్నాయి

## కృతి శెట్టి బాలీవుడ్ కి వెళ్తుందా?



ఉప్పెన- చిత్రంతో ఓవర్ నైట్ శక్ష స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న కృతి శెట్టి అలియాస్ నాగలక్ష్మి గురించి పరిచయం అక్కర్లేదు. తొలి సినిమాతోనే కుర్రకారు మనసు దోచుకున్న బ్యూటీ ఆ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో సౌత్ ఇండస్ట్రీలో దూసుకెళ్లింది. తాజాగా కృతి శెట్టి కెరీర్‌లో మరో అడుగు ముందుకేస్తుంది. ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ బాట పట్టేందుకు సిద్ధమైంది. హిందీ తెరపైనా అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను లాక్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి ప్రముఖ దర్శకురాలు విధి గెడ్డగాంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సరికొత్త లవ్ స్టోరీ ప్రాజెక్ట్ ద్వారా కృతి శెట్టి బాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇస్తోందని సమాచారం. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా.. స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రంగా ఈ మూవీ రూపుదిద్దుకోనుంది. విధి గెడ్డగాంకర్ టేకింగ్ .. నేటి తరానికి నచ్చేలా ఉండే ఎమోషనల్ పాయింట్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సౌత్‌లో లవ్ అండ్ క్యూట్ క్యారెక్టర్లతో ప్రేక్షకులను కట్టిపడేసిన కృతి శెట్టి హిందీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్ ఆడియన్స్‌ను కూడా ఫిదా చేయడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. కృతి గ్లామర్ మాత్రమే కాకుండా చక్కటి అభిన యానికి ప్రాధాన్యత ఉన్న పాత్ర కావడంతో ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హిందీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడానికి ఈ లవ్ స్టోరీ పర్ఫెక్ట్ లాంఛ్ ప్యాడ్ అవుతుందని నమ్ము తున్నారు. ఇప్పటి వరకు తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో నటించిన కృతి శెట్టి బాలీవుడ్ ఎంట్రీతో పాన్-ఇండియా ప్రయాణాన్ని మరింత విస్తృతం చేసుకోనుంది. విభిన్న భాషల చిత్రాల్లో నటిస్తూ తనలోని నటిని నిరంతరం మెరుగుపరుచుకుంటున్న అమ్మడికి హిందీ ప్రాజెక్ట్ కెరీర్ పరంగా టర్నింగ్ పాయింట్ అయ్యే ఛాన్స్ ఉంది. నేటి ట్రెండ్‌కు తగినట్లుగా యూత్‌ను అట్రాక్ట్ చేసే అన్ని హంగులు ఈ సినిమాలో ఉండేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సౌత్ నుంచి బాలీవుడ్‌కు వెళ్తున్న యంగ్ హీరోయిన్ల జాబితాలో కృతి శెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సినిమాతో ఆమె అక్కడ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

